క్లుప్తంగా

జాతీయాభిమానం పెంపొందించాలి



జానపద గీతాలు ఆలపిస్తున్న పావని

పెద్దాపురం: దేశంపై ప్రేమ, ప్రజల పట్ల నమ్మకం కలిగేలా, దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ స్ఫూర్తిని నింపాలని జేవీవీ నాయకురాలు పావని అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలోని పీసీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిబిరంలో ఆదివారం దేశభక్తి, అభ్యుదయ గీతాలను విద్యార్థులకు నేర్పించారు. అనంతరం యూటీఎఫ్ పట్టణ కార్యదర్శి బేబిరత్నం వేమన పద్యాలు నేర్పించగా డ్యాన్స్‌ను సందీప్, కర్రసామును సీలపాల కృష్ణ, కోలాటాన్ని అంజలి, కరాటే, వ్యాయామాలను తెప్పల యోగేష్, లోకేష్‌లు నేర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్, కార్యదర్శి రొంగల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

పెద్దాపురం: విద్యార్థులు ప్రతి అంశంపై శ్రద్ధ కనపర్చాలని స్థానిక గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆదివారం ఉపాధ్యాయులు రాళ్లపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

కౌలు రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు



కౌలు రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లను అందిస్తున్న శివారెడ్డి తదితరులు

కొత్తపల్లి: మండలంలోని అమరవల్లి గ్రామానికి చెందిన శివారెడ్డి ఆదివారం ఇద్దరు కౌలు రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు ఉచితంగా అందజేశారు. కౌలు రైతులు నరాల చిన్న అప్పారావు, చెలపాకల ధనయ్యకు సుమారు రూ.3 వేల విలువైన స్ప్రేయర్లు అందించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో కరోనా నియంత్రణ



కరోనాపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సన్నీ

కాకినాడ రూరల్: కరోనా వైరస్ నియంత్రణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ సన్నీ పేర్కొన్నారు. బోట్‌క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సూర్య గ్లోబల్, టీం ఆసుపత్రు సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గత అనుభవాల ఆధారంగా వైరస్ నిరోధానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకుని మాస్కులు ధరించి, చేతులు శుభ్రం చేసుకుంటూ, సామాజిక దూరం పాటించాలన్నారు. అనంతరం ఉచితంగా ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించారు. ఫార్మసిస్ట్ శ్రీవాణి, పీఎంపీ వైద్యులు కుమార యాదవ్ బీపీ పరీక్షలు చేశారు. వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రుల పరిపాలన అధికారి కె.తిరుపతిరావు, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, కోశాధికారి పీవీ రాఘవరావు, న్యాయవాది యనమల రామం తదితరులు పాల్గొన్నారు.

పశువుల ప్రాణాలు తీస్తున్నాయ్..



శునకాల దాడిలో మృతి చెందిన ఆవుదూడ

గోకవరం: వీధి కుక్కలు పశువుల ప్రాణాలు తీస్తున్న పంచాయితీ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో శనివారం రాత్రి రాటకు కట్టిఉన్న ఆవులపై వీధి కుక్కలు దాడిచేయడంతో ఆవుదూడ చనిపోగా, మరో రెండు ఆవులకు తీవ్ర గాయాలయ్యాయి. పశువులపైనే కాకుండా రాత్రి సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్తున్న స్థానికులపైన ఉరికించి కరుస్తున్నాయని పలువురు భయాందోళను చెందుతున్నారు. ఇటీవల కాలంలో కుక్కల సంచారం ఎక్కువైందని దీనిపై సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చౌక బేరమనుకున్నారా!

- ప్రభుత్వ చర్యలపై ఎండీయూ వాహనదారుల ఆందోళన
- లబ్ధిదారులకు తప్పని ఆ పాత కష్టాలు
- దూరాభారాలు, మళ్లీ మళ్లీ తిరుగుళ్లు మొదలు

పేదలంటే అంత చులకనైపోయారా? వారికి వసతులు, సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వానికి అంత కష్టమైపోతోందా? చవక మనుషులు చౌక బేరమనుకున్నారా? అలాగే కనిపిస్తోంది రేషన్ సరకులు పంపిణీ చేసే ఎండీయూ వాహనాల రద్దు చర్య. వసతులు ఇంకా మెరుగుపరచాల్సింది పోయి లబ్ధిదారులకు మళ్లీ పాత కష్టాల్లోకి నెట్టనున్నారు. ఎండనక వాననక దూరాలకు వెళ్లి బరువైన సరుకులు మోసుకు తెచ్చుకుని ఎన్నో పాట్లు పడే నాటి పరిస్థితులు కళ్లముందు కదలాడుతున్నాయి. ఇళ్లకు వద్దనే సరకులు ఇచ్చే వెసులుబాటును తొలగించడం నిజంగా ఆమోదయోగ్యం కాని చర్యే. దానికి తోడు ఎందరో యువత నిజాయతీగా పనిచేసి సంపాదించుకోవాలనే ఉద్దేశంతో రుణాలు పొంది వాహనాలు సమకూర్చుకుంటే నేడు వారి కడుపు కొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రజలే ప్రశ్నిస్తున్నారు.

సామర్లకోట: పేద ప్రజలకు రేషన్ సరకులు ఇళ్ల వద్దకే వచ్చి నిత్యావసర సరకులు అందజేసే ఎండీయు వాహనాలను రద్దు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో మండల పరిధిలో సుమారు 45వేల మంది బియ్యం కార్డుదారులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. సామర్లకోట మండల పరిధిలో 28, పెద్దాపురం మండల పరిధిలో 28 ఎండీయూ వాహనాలతో సరకులు సక్రమంగా అందేవి. వాటిని రద్దు చేయడంతో జూన్ నుంచి నియోజకవర్గంలో 56 మంది వీధిన పడనున్నారు. వీరిలో అనేక మంది ఉద్యోగ వయసు మించిపోయి, ప్రైవేటు సంస్థలలో కూడా ఉపాధి లభించే అవకాశం లేనివారే. గతంలో పట్టణ, మండల పరిధిలో 75 రేషన్ షాపులు ఉండేవి. వాటి సంఖ్య పెంచి టీడీపీ కార్యకర్తలకు కేటాయించారు. వాహనాల రద్దుతో గతంలో మాదిరిగానే ఆయా షాపులకు వెళ్లి సరకులు తీసుకోవలసి వస్తోంది. లబ్ధిదారులు వెళ్లిన సమయంలో డీలర్ లేకపోతే తిరుగుడు తప్పని పరిస్థితి. మహిళలు, యువతులు రేషన్ షాపుల వద్దకు వెళ్లే సమయంలో ఏర్పడే ఇబ్బందులు పునరావృతమవుతాయి. ఆయా రేషన్ దుకాణాల వద్ద ఉదయం, సాయంత్రం మాత్రమే సరకులు ఇస్తారు. ఈ పరిస్థితుల్లో చాలా మంది తిరిగే వెసులు బాటు లేక అనేక మంది సరకులు తీసుకోలేని పరిస్థితి ఏర్పడనుంది.



23వ వార్డులో వాహనం రాకపోవడంతో ఐదు నెలలుగా రేషన్ షాపు వద్ద వినియోగదారుల ఇక్కట్లు (ఫైల్)



ఇంటి వద్దనే ఎండీయు వాహనం నుంచి సరకులు తీసుకొంటున్న వినియోగ దారులు (పాత చిత్రం)

ప్రజలు ఇబ్బందులు పడకూడదనే

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక రేషన్ దుకాణాల్లో సమస్యలకు చెక్ పెట్టారు. వృద్ధులు, దివ్యాంగులతో పాటు మహిళలకు 44,861 మందికి ఇంటి వద్దనే సరకులు తీసుకునే వారు. సహజంగా దుకాణాల్లోని కాటా బియ్యం ఉన్న చోట ఉంటుంది. దీంతో తూకం కనపడక వినియోగదారులు అవస్థలు పడేవారు. కానీ ఎండీయూ వాహనాలు వచ్చాక ఇంటి వద్దకే ఎలక్ట్రానిక్ కాటాతో సరైన తూకంతో పారదర్శకంగా సరకులు అందించేవారు. గత 7 నెలలుగా సత్యనారాయణపురం నుంచి వచ్చే వారికి ఒక వైపు మద్యంషాపు, మరో వైపు బార్ ఉండటంతో మహిళలకు ఇబ్బందికి గురి అవుతున్నారు.

వాహన సైరన్‌తో అప్రమత్తం



ఎండీయూ వాహనం సైరన్ మోగిస్తూ ఇళ్ల వద్దకు రావడంతో లబ్ధిదారులు అప్రమత్తమై సరకులు తీసుకునేవారు. రేషన్ కార్డులో ఉన్న వారు ఎవరి వేలి ముద్ర వేసినా సరకులు గింజ తక్కువ లేకుండా అందేవి. ఎండీయుల రద్దుతో సరకులు తీసుకోవడానికి దూరాభారం తప్పదు. మహిళలు ఒంటిగా సరకులు మోసుకు రావడం ఇబ్బందిగా ఉంటుంది. జగన్‌పై కక్షతోనే ఎండీయు వాహనాలు రద్దు చేస్తున్నారు.

– కొంగు మరియమ్మ

రేషన్ వాహనాల రద్దు సరికాదు



రేషన్ వాహనాలను రద్దు చేయడం సరికాదు. దాని వల్ల రేషన్ వెతలు ప్రారంభం అవుతాయి. గంటల తరబడి రేషన్ షాపుల వద్ద క్యూలో నిలబడాలి. వాహనాల నిర్వాహకులు నిరుద్యోగులుగా మారే ప్రమాదం ఉంది. ఎండీయూ వాహనంలో రేషన్ సరకులు ఎలక్ట్రానిక్ కాటా ద్వారా ఇంటి వద్దనే తూకం సక్రమంగా ఉండేది.

– కారుకొండ పుణ్యవతి

పోరాటానికి సిద్ధమవుతున్నాం



నిరుద్యోగ యువతకు ఉపాధి కోల్పోయేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో పోరాటానికి సిద్ధమవుతున్నాం. రేషన్ వాహనాలు తిప్పడానికి ఫిబ్రవరి 2027 వరకు గడువు ఉంది. ప్రతి నెల రూ.మూడు వేలు బ్యాంకు వాయిదా చెల్లించాలి. వాహనం తీసుకునే సమయంలో రూ.68 వేలు అప్పు చేసి కట్టాం. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 90 శాతం సబ్సిడీతో వాహనం ఇచ్చారు. సబ్సిడీగా ఇచ్చిన మొత్తం ప్రభుత్వం ప్రతి నెల రూ.మూడు వేలు చొప్పున రూ.54 వేలు చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వం ఆ మొత్తం చెల్లించక పోతే వాయిదాలు తామే చెల్లించాలి. వాహనాలు విక్రయించడానికి ప్రయత్నిస్తే కొనుగోలు చేసే పరిస్థితి లేదు. ఈ వాహనం దేనికి పనికి రాదు.

– దర్శిపాటి సత్యానందం, ఎండీయూ వాహనదారుల యూనియన్ అధ్యక్షుడు, సామర్లకోట

నేడు యోగా శిక్షణ

సామర్లకోట: స్థానిక గాంధీచౌక్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో యోగా శిక్షణ ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి వార్డుకు చెందిన సచివాలయ సిబ్బంది, ఉత్సాహవంతులు సోమవారం ఉదయం ఆరు గంటలకు గాంధీచౌక్ వద్దకు హాజరుకావాలన్నారు. ఆయా వార్డుల్లో శిక్షణ పొందిన వారు వార్డు ప్రజలకు యోగాపై శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్టు కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, కౌన్సిల్ సభ్యులు, ఆయా విభాగాల అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి వారు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో వేంచేసియున్న పంచాయతన సమేత ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి, ఆదివారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, సూర్య నమస్కారాలు నిర్వహించారు. లలితా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు స్వామివారికి పంచామృతాలతో, పసుపు, కుంకుమ, సుగంధ జలాలుతో అభిషేకం చేసి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి నమక చమకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంర్భంగా పలువురు భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శికి సత్కారం



రాంబాబును అభినందిస్తున్న రామకృష్ణ

పిఠాపురం: జిల్లా వైఎస్సార్ సీపీ కార్యదర్శి అంజూరి రాంబాబును ఆదివారం గొల్లప్రోలులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంపన రామకృష్ణ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ నాయకుడు అంజూరి రాంబాబు వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి అందిస్తున్న రాజకీయ సేవలను ఆ పార్టీ అధిష్టానం గుర్తించి ఆయనకు పార్టీ పదవి ఇచ్చి గౌరవించిందన్నారు. రానున్న రోజుల్లో ఆయన మరిన్ని పదవుల పొంది ఉన్నత శిఖరం ఎదగాలని కోరారు. పద్మశాలీలు చేనేతలు ఏ పార్టీలో ఉన్నా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చేనేత కులాల సమాఖ్య అధ్యక్షుడిగా సహకరిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటిచెర్ల మధుబాబు, పంపన సూర్యనారాయణ, సూరిశెట్టి సూరిబాబు, మొండి లోవరాజు, జాగు సత్తిబాబు, గిడుతూరి శ్రీనివాస్, కాకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంపై ఉత్కంఠ

సామర్లకోట: ఈ నెలలో జరిగే కౌన్సిల్ సమావేశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ప్రతి నెల మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరుగుతుంది. చైర్‌పర్సన్ అందుబాటులో లేని సమయంలో వైస్ చైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. అయితే సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా చేయడం, మెజార్టీ సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టి ఆమోదం పొందడం, అవిశ్వాసం ఆమోదం పొందిన మరుసటి రోజున చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ తన రాజీనామాను ఉపసంహరణ చేసుకుంటున్నట్లు కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతి పత్రం అందజేసిన విషయం తెలిసిందే. చైర్‌పర్సన్ రాజీనామా అంశం అజెండాలోకి తీసుకువచ్చి సభ్యుల ఆమోదం పొందిన్నప్పుడే రాజీనామా అమలులోనికి వస్తుంది. వైఎస్సార్ సీపీకి చెందిన చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం, అవిశ్వాసం ఆమోదం పొందడంతో ఈ నెలలో సమావేశం ఏ విధంగా జరుగుతుందోనని పట్టణ ప్రజలలోను, కౌన్సిల్‌లోను ఉత్కంఠ నెలకొంది. అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందడంతో మొదటి వైస్‌చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించాలని మెజార్టీ సభ్యులు కమిషనర్‌కు సూచించారు. అయితే చైర్‌పర్సన్ రాజీనామా ఉపసంహరణ చేసుకోవడంతో ఆమె అధ్యక్షతనే ఈ నెలలో సమావేశం నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అవిశ్వాస తీర్మానం అంశం హైకోర్టులో ఉండటంతో ఆ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. వచ్చే నెల 18వ తేదీన కోర్టు తీర్పు వచ్చే అవకాశం ఉందనే వాదనలు ఉన్నాయి. దాంతో గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన సమావేశం జరిగే అవకాశం ఉంది. అయితే మెజార్టీ సభ్యులు ఆమెను వ్యతిరేకించడంతో ఈ నెలలో అజెండాలో అంశాలు ఆమోదం పొందే అవకాశం కనిపించడం లేదు. కౌన్సిల్ సమావేశానికి సభ్యులు హాజరై సంతకాలు పెట్టి సమావేశం నుంచి వాకౌట్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటి వరకు అజెండా తయారు కాక పోవడంతో ఏం జరుగుతుందో అనే చర్చ జరుగుతోంది.

రోహిణి కార్తెలో వర్షాలు

ఏలేశ్వరం: పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ప్రతాపం చూపగా మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై గాలులతో కూడిన వర్షం పడింది. వర్షానికి వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణ మార్పుల్లో భాగంగా వారంరోజులుగా అడపాదడపా వర్షాలు పడుతున్నా యి. ఉదయం ఎండలు, సాయంత్రం వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే మొదటివారంలో రుతుపవనాలు సమీపిస్తాయని వా తావరణశాఖ తెలపడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మొలకల ములుకులు

- పనల వద్ద రైతుల రోదన
- ఆదుకునే వారికోసం ఆరాటం

సామర్లకోట: నాలుగు రోజులుగా ఎరతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ధాన్యం రాశులతో పాటు వరి పనలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. పట్టణ పరిధిలోని భీమవరంలో బలుసుల పేటకు చెందిన కౌలు రైతులు సాగు చేస్తున్న 20 ఎకరాల్లో పనలపై ఉన్న వరి వర్షాలకు తడిసి మొలకలు వచ్చాయని రైతు నేతల హరిబాబు వాపోయారు. ఆదివారం ఎండ రావడంతో పనలను తిరగేసే ప్రయత్నం చేయగా మొలకలు వచ్చాయని తెలిపారు. కోత యంత్రాలు అందుబాటులో లేక పది రోజుల క్రితం మనుషులతో వరి కోసినపుడే వర్షాలు కురిసి పనలు తడిసిపోయాయని ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సక్రమంగా సీఎంఆర్ జరగడం లేదని, సీఎంఆర్ ఇచ్చిన సమయంలో ధాన్యాన్ని మిల్లుకు తీసుకు వెళ్తే ధాన్యం మిల్లుకు చేరినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి బస్తాకు రూ.25 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. భీమవరం దిగువన మారో 20 ఎకరాల్లో పంట పనలపై ఉన్నదని, **పనలు తిరగేయడానికి ఎకరానికి ఇద్దరు కూలీలకు రూ.1400 ఖర్చు అవుతుందని, పనలు ఆరిన తరువాత నూర్పిడి చేస్తామని, అధికారులు** స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని హరిబాబు కోరుతున్నారు. అలాగే వీకే రాయపురంలో రైతుల ధాన్యం తడిసి మొలకలు వచ్చినా ఇప్పటి వరకు అధికారుల స్పందించలేదని రైతులు ఆరోపిస్తున్నారు.



ఆరుదల ఇవ్వడంతో పనలు తిరగ వేస్తున్న కౌలు రైతు



భీమవరం పొలంలో తడిసిన వరి పనల నుంచి మొలకలు

మరిడమ్మ జాతరకు ఏర్పాట్లు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ తల్లి జాతరకు ఏర్పాట్లు ముమ్మరం చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అధికారులను ఆదేశించారు.ఆలయ సమీపంలో ఆదివారం జాతర వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈఓ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏటా ఆషాఢ మాసంలో నిర్వహించే జాతరను ఈసారి వైభవంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, కొత్తెం కోటి, ఎలిశెట్టి నాని, తూతిక రాజు తదితరులు పాల్గొన్నారు.



మరిడమ్మ జాతర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిన రాజప్ప



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ఆలయానికి భక్తుల రద్దీ

ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అన్నదానానికి దాతలు సహకరించాలని ఆమె కోరారు.

నేటి నుంచి నీలమ్మ జాతర

సామర్లకోట: స్థానిక నీలమ్మ చెరువు వద్ద కొలువైన నీలమ్మ తల్లి జాతర ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ నాయకుడు గిడుతూరి శ్రీనివాసు తెలిపారు. సుమారు 150 ఏళ్ల క్రితం పట్టణానికి నడిబొడ్డులో చెరువు తవ్విన సమయంలో దొరికిన విగ్రహాన్ని నీలమ్మ తల్లిగా గుర్తించి, చెరువుకు ఆ తల్లి పేరు పెట్టినట్లు పూర్వీకులు చెప్తారు. సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అమ్మ వారి దర్శనం, గ్రామోత్సవం నిర్వహించనున్నారు. మంగళవారం అమ్మవారి సిరి బొమ్మ ఊరేగింపుతో జాతర, తిరునాళ్ల జరుగుతాయని ఆలయ కమిటీ నాయకులు తెలిపారు.

ఘనంగా నేరెళ్లమ్మ తల్లి జాతర

కొత్తపల్లి: మండలంలోని నాగులపల్లి గ్రామ దేవత నేరెళ్లమ్మతల్లి జాతర మహోత్సవాలను ఆదివారం ప్రారంభించారు. అమ్మవారి గరగలను గ్రామంలో ఊరేగించారు. సోమవారం రాత్రి జాతర, మంగళవారం తీర్థాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఏడాది జాతర, ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు.

నేడు కొమరగిరిలో..

మండలంలో కొమరగిరిలో కొలువైన నేరెళ్లమ్మ తల్లి జాతరను సోమవారం రాత్రి నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలు, వివిధ రకాల పూలతో అలంకరించనున్నట్టు తెలిపారు. మంగళవారం తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

డీఎస్సీ మోడల్ పరీక్షకు స్పందన



మోడల్ పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

బాలాజీచెరువు: యంగ్‌మైండ్ రేపటి తరంకోసం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన ఉచిత డీఎస్సీ మోడల్ గ్రాండ్ టెస్ట్‌కు విశేష స్పందన వచ్చింది. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 566 మంది హాజరై పరీక్ష రాశారు. పరీక్ష నిర్వహణను పీఆర్‌టీయూ సంఘ ప్రతినిధులు పరిశీలించి పరీక్ష అనంతరం కీ విడుదల చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చింతాడ ప్రదీప్‌కుమార్, ఇనిస్టిట్యూట్ అధినేత శ్యామ్, వాకాడ వెంకటరమణ, జీవీ సుబ్బారావు, డీవీవీ బాపిరాజు, ఇనిస్టిట్యూట్ సీఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం సురక్షితం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): ప్రకృతి సాగుతో ఆరోగ్యకరమైన పంటలు, పండ్లను పండించడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని రక్షించిన వారవుతారని ప్రకృతి వ్యవసాయ నిపుణులు ఎం.విజయ్‌రామ్ అన్నారు. ప్రకృతి రాగా సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ దంటు కళాక్షేత్రంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయ్‌రామ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. భావి తరాలు రోగాల బారిన పడకుండా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయమే పరిష్కారమన్నారు. దీని వల్ల రసాయనాల వినియోగం లేని పంట ఉత్పత్తులను చేయడం వల్ల సమాజంలో ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రజలు స్వీకరించడానికి అవకాశం ఉంటుందన్నారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం కూడా చాలా అవసరమని దీనిలో అనేక విధమైన పోషకాలు లభ్యమవుతాయన్నారు. సుభాష్ పాలేకర్ కృషి వ్యవసాయ విధానంలో ఎరువులు, పురుగుమందులు కొనే అవసరం ఉండదన్నారు. గ్రామీణ వికాసం కోసం ప్రస్తుతం మూస పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నారని, దీని వల్ల భూ తాపం పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూతాపాన్ని తగ్గించేందుకు ఐదు అంచెల విధానాన్ని ఆయన వివరించారు. ఈ విధానంలో ఐదు దశల్లో అంతర పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ప్రకృతి రాగా సంస్థ అధినేత మల్లికార్జునరావు మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించకుంటే భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఎలైట్ క్లబ్ సభ్యులు మైలవరపు సత్యనారాయణ, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయ్‌రామ్

కశ్మీర్‌లో రాజ్యాంగ హక్కులు అమలు చేయాలి

కాకినాడ సిటీ: భారత యూనియన్‌లో విలీనం సందర్భంగా కశ్మీర్‌కు కల్పించిన రాజ్యాంగ హక్కులు అమలు చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ పేర్కొన్నారు. రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి కాకినాడ యూటీఎఫ్ టీచర్స్ హోంలో కశ్మీర్ పూర్వాపరాలు–ప్రస్తుత సవాళ్లు అంశంపై సదస్సు నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సూరిబాబు అధ్యక్షతన అజశర్మ ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం నేషనల్ కాన్ఫరెన్స్ నాయకత్వంలో జరిగిన ప్రజా ఉద్యమం ద్వారా కశ్మీర్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందన్నారు. ఆ సందర్భంగా రాజ్యాంగం 370 అధికరణం, 35 ఏ చేర్చబడ్డాయన్నారు. 75 ఏళ్లుగా కేంద్ర పాలకులు ఎవరున్నా, కశ్మీర్‌లో రాజ్యాంగ హక్కులు సక్రమంగా అమలు చేయలేదన్నారు. తాజాగా కశ్మీర్‌లో భూములు కార్పొరేట్లు కాజేసే అవకాశం దక్కిందన్నారు. దీని వల్ల నిరుద్యోగం పెరిగి ఇతర సమస్యలు పెరగడానికి కారణమవుతుందన్నారు. ఉగ్రదాడి సందర్భంగా కశ్మీర్ ప్రజలంతా దేశంవైపే ఐక్యంగా నిలబడ్డారని కొనియాడారు. ఉగ్రవాదం, మతోన్మాదం మానవాళికి ప్రమాదకరమన్నారు. సదస్సుకు ఆర్‌వీఎస్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్.గోవిందరాజులు ఆహ్వానం పలుకగా యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంవీ సాయిరాం వందన సమర్పణ చేశారు. యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మతో పాటు పలువురు ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ